
చాగలమర్రిలో సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్

డ్రాగన్ ఫ్రూట్.. భలే

చాగలమర్రి, ఆగస్టు 25:
ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసే రైతులు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టాలు చవి చూస్తున్నారు. పత్తి, మామిడి తోటల మీది నుంచి ఇటీవల డ్రాగన్‌ఫ్రూట్స్ సాగు వైపు రైతులు దృష్టి మళ్లిస్తున్నారు. మన వాతావరణం అనుకూలంగా ఉండటంతోపాటు ఒకసారి మొక్క నాటితే 20 నుంచి 25 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. ఉమ్మడి జిల్లాలో 70 ఎకరాల దాకా ఈ పంట సాగు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 30 ఎకరాల్లో, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రుద్రవరం, బత్తలూరు, చాగలమర్రి గ్రామాల్లో 12 ఎకరాల్లో పంటను సాగు చేశారు. చాగలమర్రిలో ఉల్లి రమేష్ అనే రైతు నాలుగు ఎకరాల్లో, మహిళా రైతు అమ్మణ్ణి నాలుగు ఎకరాలు ఈ ఏడాది కొత్తగా పంట సాగు చేసి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేశారు.

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో లాభసాటి
- టన్ను రూ.50 వేల నుంచి రూ.90 వేలు
- పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం కరువు
- ఉపాధి నిధులతో అండగా నిలవాలి
- డ్రిప్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి

నాలుగు ఎకరాల్లో ఐదు వేల మొక్కలు

ఏడాది క్రితం ఈ పంట సాగు చేసి నాలుగు ఎకరాల్లో ఐదు వేల మొక్కలు నాటారు. ఎకరాకు 500 స్తంభాల ప్రకారం నాలుగు ఎకరాల్లో రెండు వేల సిమెంట్ స్తంభాలను కొనుగోలు చేశారు. రింగ్ సిస్టమ్ ద్వార డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నాడు. మొక్కలను వియత్నం, తైవాన్ నుంచి తెప్పించుకొని నాటారు. దాదాపు ఎకరాకు రూ.3 లక్షల ప్రకారం రూ.12 లక్షల దాకా ఖర్చు చేశారు. 25 ఏళ్ల పాటు డ్రాగన్‌ఫ్రూట్ దిగుబడి వస్తుంది. ఎకరాకు ఐదు నుంచి పది టన్నుల దిగుబడి ఉంటుంది. టన్ను రూ.50 వేల నుంచి రూ.90 వేలు పలుకుతోంది. గత ఏడాది టన్ను రూ.1.30 లక్షల వరకు కూడా ధర పలికింది. పెట్టిన పెట్టుబడి ఏడాదిలోనే వస్తుంది. మొక్కల వయస్సు పెరిగే కొద్ది కొమ్మలు కూడా విస్తరిస్తుంటాయి. ఫలితంగా పూత పెరిగి పండ్ల దిగుబడి బాగుంటుంది. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మొదటి ఏడాదే పెట్టిన పెట్టుబడి వస్తుంది. 15 రోజులకు ఒకసారి పండ్లు కోతకు వస్తాయి.

ఔషధాల డ్రాగన్‌ఫ్రూట్



డ్రాగన్‌ఫ్రూట్ వివిధ ఔషధాలకు కూడా ఉపయోగపడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. డ్రాగన్‌ఫ్రూట్ తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చెబుతున్నారు. డ్రాగన్‌ఫ్రూట్ 15 రోజులకు ఒకసారి కోతకు వస్తాయి. దిగుబడి మహారాష్ట్ర దావణగేరి, తిరుపతి, నంద్యాల, కడప, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. వ్యాపారులే వచ్చి టన్నుల ప్రకారం కొనుగోలు చేస్తారు. తోపుడుబండ్ల వ్యాపారులు తోటల వద్దకే వెళ్లి కేజీ రూ.150 నుంచి రూ.200 ప్రకారం కొనుగోలు చేస్తారు. రెండేళ్ల నుంచి డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేయడంతో ఆయా గ్రామాల రైతులు సందర్శించి సాగు విధానాల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. మహిళా రైతు అమ్మణ్ణి ఈ ఏడాది కొత్తగా వినూత్న పద్ధతిలో సాగు చేస్తున్నారు. 4 ఎకరాల్లో 5 వేల మొక్కలు నాటారు. ఎకరాకు 500 స్తంభాల ప్రకారం 4 ఎకరాల్లో 2 వేల సిమెంట్ స్తంభాలను కొనుగోలు చేశారు. డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలను నాటించారు. ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ.15 లక్షల దాక ఖర్చు చేశారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందని ఆశించి డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఉపాధి రాయితీలు కల్పించాలి



డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు ఉపాధిహామీ నిధుల ద్వార రాయితీ కల్పించాలి. 4 ఎకరాల్లో ఎకరాకు రూ.12 లక్షల దాక ఖర్చు చేశా. ఉపాధిహామీ ద్వార రాయితీ కల్పిస్తే మరో 2 ఎకరాలు చేసుకుంటా. ఏడాదిలోనే 10 టన్నుల దిగుబడి వచ్చింది. వ్యవసాయ పనులు చేసుకునేందుకు హార్టికల్చర్ ద్వార ట్రాక్టర్, పనిముట్లు అందించాలి. ఉపాధిహామీ నిధులు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్న అధికారులు పట్టించుకోలేదు. రైతులను పండ్ల తోటల సాగుకు ప్రోత్సహించడం కరువైంది. బంగ్లదేశ్, థాయ్‌ల్యాండ్, వియత్నాం ప్రాంతాలకు వెళ్లి కొత్త తరహాలో పంట సాగు చేసేందుకు విహారయాత్ర ద్వార వెళ్లి అక్కడి సాగును చూసి కొత్త రకాలతో పంట సాగు చేయాలన్న ఆలోచన ఉంది. దీనికి ప్రభుత్వం ప్రోత్సహిస్తే బాగుంటుంది.
ఉల్లి రమేష్, రైతు, చాగలమర్రి

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. కొత్తగా ఈ ఏడాది 4 ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నా. రూ.15 లక్షల దాక ఖర్చు చేస్తున్నా. ఉపాధి, ఉద్యానశాఖ ద్వారా రాయితీ కల్పిస్తే మరో 4 ఎకరాల్లో సాగు చేస్తా. పండ్ల తోటలపై అవగాహన కల్పించాలి. డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు పెట్టుబడి తక్కువ. డ్రిప్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి.
-అమ్మణ్ణి, మహిళా రైతు, చాగలమర్రి


కుప్పగా పోసిన డ్రాగన్‌ఫ్రూట్

డ్రిప్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం

రైతులకు ఈ ఏడాది డ్రిప్ సౌకర్యం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేసే రైతులకు మొక్కలకు మాత్రమే డబ్బులు చెల్లిస్తాం. వ్యవసాయ పనిముట్ల కోసం ప్రతిపాదనలు చేస్తున్నాం. పండ్ల తోటలు సాగు చేసేందుకు ఉపాధి హామీలో మూడేళ్ల పాటు ప్రభుత్వమే ఖర్చు చేస్తుంది. పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి రాయితీలు కూడా అందిస్తుంది.
-శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి, ఆళ్లగడ్డ

దళారులతో మోసపోతూ..

డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేసిన మార్కెట్ సౌకర్యం లేక వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. దళారుల వ్యవస్థ అధికం కావడంతో టన్నుల ప్రకారం విక్రయించేందుకు గిట్టుబాటు కావడం లేదు. కేజీల ప్రకారం విక్రయించుకోవాల్సి వస్తోంది. దళారీ వ్యవస్థను తొలగించి ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించి డ్రాగన్‌ఫ్రూట్ ఎగుమతి చేసేలా చూడాలి. ఉపాధి హామీ పథకం ద్వార డ్రాగన్‌ఫ్రూట్‌ను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలి. హార్టికల్చర్ ద్వార రైతులను ప్రోత్సహిస్తే సాగు మరింత పెరిగే అవకాశం ఉంది.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం కరువు

సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటలు సాగు చేయడానికి ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేయూత అందిస్తోంది. పండ్ల మొక్కలతో పాటు సాగుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తుంది. వర్షాలు కురుస్తుండటంతో రైతులు పండ్ల తోటల సాగుకు తగిన అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. చాగలమర్రి గ్రామంలో ఉల్లి రమేష్ అనే రైతు 4 ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేశారు. ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేయాలని గత ఏడాది దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు మాత్రం ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదు. జాబ్‌కార్డు ఉన్న ఉపాధిహామీ నిధులు మంజూరు చేయలేదు. శెట్టివీడు గ్రామంలో పొలం ఉందని, నివాసం చాగలమర్రిలో ఉన్నారని ఉపాధిహామీ నిధుల కోసం పెట్టిన దరఖాస్తును రద్దు చేసి పట్టించుకోలేదు. దీంతో రైతు తన సొంత నిధులతోనే పంట సాగు చేసి మిగతా రైతులకు ఆదర్శంగా నిలిచాడు.


డ్రాగన్‌ఫ్రూట్‌లను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

- లఖ్-పతి దీదీ కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి
- జిల్లాలో 663 పొదుపు స్వయం సంఘాలకు రూ.62.64 కోట్ల బ్యాంకు రుణాలు


కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీలు మెగా చెక్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల (కల్చరల్)/ నంద్యాల రూరల్, ఆగస్టు 25: లఖ్-పతి దీదీ కార్యక్రమం కింద మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యమని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని జెల్గాన్ నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లఖ్-పతి దీదీ కార్యక్రమం కింద ప్రధాని నరేంద్రమోదీ మహిళలను సత్కరించే కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలలో లైవ్ ద్వారా కలెక్టర్ రాజకుమారి డీఆర్‌డీఏ వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొని వీక్షించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం లఖ్-పతి దీదీ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 663 స్వయం సహాయక సంఘాల సభ్యులైన లఖ్-పతి దీదీ"లకు రూ.62.64కోట్ల బ్యాంకు రుణాలకు సంబంధించిన మెగా చెక్‌ను కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీలు పంపిణీ చేశారు. అలాగే 4 మండలాల మహిళా సమాఖ్యలకు 40 లక్షల రూపాయల సీఐఎఫ్ నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం, ఏపీఎంలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు
కలెక్టర్ రాజకుమారి

కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమి పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2వ తేదీన ఈ కార్యక్రమం ఉంటుందని అన్నారు.

ఆక్రమణల కూల్చివేతపై నిరసన

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 25: మహానందీశ్వరస్వామి దేవస్థాన భూముల ఆక్రమణ కూల్చివేతతో బాధితులు ఆదివారం నిరసనకు దిగారు. స్టేట్ బ్యాంక్ కాలనీలో కోర్టు తీర్పు మేరకు శనివారం ఆక్రమణలను కూల్చి వేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితులు ఆదివారం తమకు చెందిన కోర్టు పత్రాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదనశర్మ, కుమార స్వామి సుధాకర్, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేవస్థానానికి 1.78 ఎకరాల భూమి మాత్రమే ఉందని, మిగిలిన రెండు ఎకరాలు ప్రైవేట్ భూమికి చెందిందని చెప్పారు. తమ స్థలాలను కూడా దేవస్థానానికి చెందినవని ఆరోపించడం సమంజసం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబరుకు సబ్ డివిజన్ చేయకనే 3.78 ఎకరాల ఎండో మెంట్ భూమిగా చూపిస్తున్నారని అన్నారు. నిరసనలో దాదాపు 20 మంది స్థల యజమానులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు


క్యూలో వేచిఉన్న భక్తులు

శ్రీశైలం, ఆగస్టు 25: శ్రీశైలం మహాక్షేత్రానికి శ్రావణమాసం ఆదివారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం వేకువజాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్టనందు స్వామివారికి తలనీలాలు సమర్పించి, పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు. భక్తులతో క్షేత్ర ప్రధాన వీధులు రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్న దాన భవనంలో అన్నప్రసాద వితరణను చేశారు. క్షేత్ర పరిధిలోని సత్ర సముదాయాలు కూడా రద్దీగా కనిపించాయి. లోక కల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వర స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

పుష్కర ఘాట్లను ముంచెత్తిన వరద


ఎగువ ఉమామహేశ్వరుని ఆలయం వద్ద పుష్కర ఘాట్లను ముంచెత్తుతున్న వరద జలాలు

కొత్తపల్లి, ఆగస్టు 25: ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదలవుతున్న వరద జలాలతో కొత్తపల్లి మండలంలోని సప్తనది సంగమ తీరంలో ఎగువ పుష్కర ఘాట్లను వరద జలాలు ముంచెత్తుతున్నాయి. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ ప్రాంతం నుంచి 45,759 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, 883.90 అడుగులుగా నమోదైంది. అలాగే పూర్తి స్థాయి జలాశయ నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా, 209.59 టీఎంసీలుగా నమోదయ్యాయి. ప్రాచీన సంగమేశ్వర స్వామి ఆలయం నెల రోజుల క్రితమే కృష్ణమ్మ నది గర్భంలో నిక్షిప్తమైంది. దీంతో విచ్చేసిన భక్తులు పవిత్ర సప్తనదీ జలాలతో స్నానాలు ఆచరించి ఎగువ ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. ఇలాగే ప్రాజెక్టుకు వరద నీరు కొనసాగితే.. రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయి నీటి నిల్వకు చేరుకోనుంది.

స్పిల్‌వే మరో గేటు ఎత్తి వేత


మూడు గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు

వెలుగోడు, ఆగస్టు 25: తెలుగు గంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయ స్పిల్‌వేకు చెందిన మరో గేటును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో మూడు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నుంచి 11,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి 11,230 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. టీజీపీ మెయిన్ కెనాల్ ద్వారా ఐదు వేల క్యూసెక్కులు, స్పిల్ వే మూడు గేట్ల నుంచి 6,120 క్యూసెక్కులు, వన్‌ఎల్ 30, వన్‌ఆర్ 50, నంద్యాల తాగునీటి పథకానికి 15 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూడు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుద చేస్తుండటంతో వీబీఆర్‌కు సందర్శకుల తాకిడి అధికమవుతోంది.

అంకితభావంతో పని చేయాలి

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 25: నిబద్ధత, అంకితభావంతో విధి నిర్వహణ చేయాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఆదివారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చే ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా గ్రేవ్ పెండింగ్ కేసులు వాటి రౌడీషీటర్స్ పాత్ర, అనుమానిత మరణాలు, మిస్సింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై ఆరా తీసి సంబంధిత ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నేరాలు అధికంగా జరిగే అవకాశం ఉన్న చోటల్లా సీసీ కెమెరాల ఏర్పాటు, విజిబుల్ పోలీసింగ్, నిరంతరం బీట్ వాహనాలు తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, నంద్యాల డీఎస్పీ యుగంధర్ బాబు, సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలపై స్పెషల్ డ్రైవ్

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై శుక్ర, శనివారాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పోలీస్ అధికారులు ఆదివారం తెలిపారు. విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా దాడులు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ దాడులు కొనసాగాయని పేర్కొన్నారు. సివిల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో 14కేసులు నమోదు చేసి 15మందిని అరెస్ట్ చేసి 39.4లీటర్ల అక్రమ మద్యం, 108లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పేకాటస్థావరాలపై దాడులు చేసి 3కేసులు నమోదు చేసి 14మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.19,580స్వాధీనం చేసుకున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 687మందిపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.3,22,215 జరిమానా విధించామన్నారు. ఇసుక అక్రమ రవాణా కేసులో 4కేసులు నమోదుచేసి 11మందిని అరెస్ట్ చేసి 9వాహనాలు స్వాధీనం చేసుకొని 169టన్నుల ఇసుకను సీజ్ చేసినట్లు వివరించారు.

నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రతి వారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

మహిళలందరూ లక్షాధికారులు కావాలి

- కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు
- మహిళలకు ఆర్థిక చేయూత ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం
- జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య



మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ, జేసీ నవ్య, ఎమ్మెల్యే

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 25: ప్రభుత్వం అందజేస్తున్న లఖ్ పత్ దీదీ కార్యక్రమం ద్వారా మహిళలు కృషి చేసి లక్షాధికారులు కావాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని జల్గావ్‌లో ఏర్పాటు చేసిన లఖ్ పత్ దీదీ సమ్మేళనలో భాగంగా ప్రైమ్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం సహాయక బృందాల (ఎస్ హెచ్‌జీఎస్) మహిళలను సత్కరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలెక్టరేట్ ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ బి. నవ్య, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి తదితరులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని మహిళలందరూ ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక లబ్ధిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పొదుపు సంఘాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొంది సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ సకాలంలో పొందిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. జాయింట్ కలెక్టర్ బి. నవ్య మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా మహిళలు వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయంగా వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ బ్యాంకులు అందజేస్తున్న ఆర్థిక సహాయం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక విజయం సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం జిల్లాలోని 826 మంది స్వయం సహాయక సంఘాల లఖ్ పత్ దీదీలకు బ్యాంకుల ద్వారా రూ.57.60 కోట్లుమెగా చెక్కును కర్నూలు ఎంపీ, జేసీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎల్‌డీఎం రామచంద్రరావు, పొదుపు సంఘాల మహిళలు, సీఆర్పీలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

కోర్సుల ఎత్తివేతకు ఉత్తర్వులు

అంగీకరించని తల్లిదండ్రులు

ఆలూరు, ఆగస్టు 25 : ఆలూరు మండలంలోని డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లు ఎత్తివేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే కోర్సుల ఎత్తివేతను వారు అంగీకరించలేదు. ఆ రెండు గ్రూప్‌లు తీసుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని, ఎత్తివేసి సైన్స్ గ్రూప్‌లను ప్రవేశపెడితే అడ్మిషన్లు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. అయితే ప్రిన్సిపాల్ ప్రచారం చేయకపోవడం వల్ల విద్యార్థులకు సమాచారం తెలియక చేరడం లేదని వచ్చే ఏడాది వంద శాతం పిల్లలు చేరుతారని జిల్లా అధికారికి పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ సునీల్, వైస్ ఛైర్మన్ చంద్ర మోహన్ చెబుతున్నారు. ఉన్న గ్రూప్‌లను తొలగించకుండా సైన్స్ గ్రూప్‌లను కూడా ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ శ్రీదేవి స్పందిస్తూ ఉన్నత అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ


మాట్లాడుతున్న ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ

ఆలూరు, ఆగస్టు 25 : అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ అన్నా. ఆదివారం ఆలూరు పట్టణంలోని బ్రెయిలీ భగవద్గీత ఆలయం వద్ద ఉపాధ్యాయుడు బూర్ల లక్ష్మన్న అంధుల కోసం తెలుగులో తర్జుమా చేసి అచ్చు వేయించిన బ్రెయిలీ భగవద్గీత పుస్తకాన్ని, శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జీవిత చరిత్రను పుస్తకాలను ఆమె ఆవిష్కరించారు. అంధుల కోసం శ్రమించి పుస్తకాలను అచ్చి వేయించిన బూర్ల లక్ష్మన్నను జడ్జి అభినందించారు. అనంతరం కృమడి జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరచిన మోడల్ స్కూల్ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రంగమ్మ, ఉపాధ్యాయులు సద్గురు, మహాదేవమ్మ, న్యాయవాది వాయుజీవోత్తం రావ్, రిటైర్డ్ ఉద్యోగులు వీరాస్వామి, వెంకటేశ్వరులు పాల్గొన్నారు

ముగిసిన కన్నడిగుల 9వ మహా మేళా

పాల్గొన్న వివిధ జిల్లాల ప్రతినిధులు


మాట్లాడుతున్న పీఠాధిపతులు

ఆదోని టౌన్, ఆగస్టు 25 : ఆదోని పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర కన్నడిగుల 9వ మహా మేళ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, గోవా, కేరళ రాష్ట్రాలలోని వివిధ జిల్లాల నుంచి కన్నడిగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నరగుందలోని విరక్త మఠం పీఠాధిపతి శాంతలింగ మహాస్వామి, కల్లు మఠం పీఠాధిపతి గురు శిద్ద దేవరు మా ట్లాడుతూ కన్నడ భాష సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అంతరించిపోకుండా రానున్న తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకు సమష్టి కృషి జరగాలని సూచించారు. కన్నడిగుల కోసం నిర్వాహకులు కవి గోష్టి, కవిత గోష్టిలతోపాటు మహిళలకు కూచిపూడి నృత్యాలు, రంగవల్లులే, విద్యార్థులకు చిత్ర లేఖనం, క్విజ్ పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు పీఠాధిపతులు బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభను కనబరిచిన నామ బసవరాజ, భీమన్న, గురు శిద్దప్పలను గురువులు సన్మానించారు. కార్యక్రమాలు కర్ణాటక విద్యా వర్ధక సంఘం (ధ్వార్వాడ) ప్రధాన కార్యదర్శి శంకర్ హలగట్టి, ఆదోని కన్నడ సంఘం పెద్దలు శరణ బసప్ప, సుగురప్ప, ప్రతాప్, మరుల రాజ్య, విద్ధన గౌడ్, గురుబసవ, ఆధ్వర్యంలో జరిగాయి.

రేపటి నుంచి అసెస్‌మెంట్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 25: 2024-25 విద్యాసంవత్సరానికి గాను సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 షెడ్యూలు విడుదలైందని ఈ పరీక్షలు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఆదివారం తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రశ్నాపత్రాలు అన్ని ప్రభుత్వ యజమాన్య పాఠశాలలకు మాత్రమే డీసీఈబీ సరఫరా అవుతాయని తెలిపారు. ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు ఈ పరీక్షలకు సంబంధించిన ఈ ప్రశ్నాపత్రాలు అన్ని మండల ఎంఆర్సీలకు పంపినట్లు తెలిపారు. త్రీమెన్ కమిటీ ప్రశ్నాపత్రాలు ఎంఆర్సీలో భద్రపరిచి షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు పరీక్షకు గంట ముందు ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రశ్నాపత్రాలు సంబంధిత పాఠశాలలకు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు ఓఎంఆర్‌లు ఒకరోజు ముందు అందిస్తా మన్నారు. ప్రశ్నా పత్రాలు సరఫరా చేసే సిబ్బంది గోప్యతను తప్పక పాటించాలన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న న్యాయాధికారులు


స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

బేతంచెర్ల, ఆగస్టు 25: ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహస్వామి మహాలక్ష్మి అమ్మవార్లను ఆదివారం జిల్లా న్యాయాధికారి కబర్ధి, డోన్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మద్దిలేటి నరసింహ స్వామికి, మహాలక్ష్మి అమ్మవార్లకు వారు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో రామాంజనేయులు వారిని శాలువలతో సన్మానించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

నూతన కోర్టు భవన నిర్మాణ పనులను

పరిశీలించిన జిల్లా న్యాయాధికారి

డోన్(రూరల్): డోన్‌లో నూతన కోర్టు భవన నిర్మాణ పనులను కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ధి ఆదివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్, డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో రూ.18.79 లక్షలు టోకరా

మంత్రాలయం, ఆగస్టు 25: పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.18.79 లక్షలు తన ఖాతాలో వేయించుకొని ఓ వ్యక్తి దగా చేశాడు. ఈ నెల 23న మంత్రాలయంలో పెళ్లి జరగాల్సి ఉండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది. బళ్లారి జిల్లా దావణగెరి పట్టణానికి చెందిన బసవరెడ్డి కొడుకు జనార్దన్ రెడ్డికి గతంలో ఒక మహిళతో వివాహమైంది. వారు విడాకులు తీసుకున్నారు. మొదటి పెళ్లి అయినట్లు చెప్పకుండా కోడుమూరు చెందిన విష్ణుప్రియ (32) అనే యువతితో ప్రేమ వ్యవహారం నడిపాడు. తను పలు కంపెనీలకు సీఈవోనని, దుబాయ్, లండన్, బెంగుళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో తనకు కంపెనీలు ఉన్నాయని ఆరు నెలలుగా యువతిని నమ్మించాడు. పెళ్లి చేసుకునేందుకు రూ.18.79 లక్షలు తన ఖాతాలో వేయించుకున్నాడు. ఈ నెల 23న మంత్రాలయం భూరమణ కళ్యాణ మండపంలో వివాహం జరగాల్సి ఉండగా.. పెళ్లి కూతురు తరపున బంధువులకు మొదటి పెళ్లి అయిందని తెలియడంతో వివాహం రద్దయింది. దీంతో పెళ్లికూతురు బంధువులు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంత్రాలయం ఎస్ఐ పరమేశ్వర్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'తెలుగు సాహిత్యానికి కాఫ్కా.. కాశీభట్ల వేణుగోపాల్'

కవులు, రచయితలు, కళాకారుల నివాళి


మాట్లాడుతున్న సాహితీ విమర్శకుడు పి. చంద్రశేఖర్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 25: తన రచనలతో 20వ శతాబ్దాన్ని అత్యంత ప్రభావితం చేసిన జర్మన్ రచయిత 'ఫ్రాంజ్ కాఫ్కా'లానే తెలుగు సాహిత్యంలో దివంగత కవి, రచయిత కాశీభట్ల వేణుగోపాల్ నిలిచిపోతారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం నగరంలో మద్దూర్‌నగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, కర్నూలు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభ జరిగింది. ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ఆహ్వానం పలుకగా, ప్రముఖ కవి జి. వెంకటకృష్ణ సభాధ్యక్షత వహించారు. వక్తగా హాజరైన రచయిత, ప్రముఖ విమర్శకుడు పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కాశీభట్ల వేణుగోపాల్ కుటుంబానికి, మతానికి, రాజ్యానికి ఎప్పుడూ బద్ధుడు కాలేదని, ఆయన సంప్రదాయ భ్రష్టత్వంలో జీవించిన ఆధునిక కవి అని కొనియాడారు. విలక్షణమైన రచయితగా, సమాజం పట్ల ముభావంగా ఉంటూ రచనలు చేశారని అన్నారు. ఆయన నిరంతరం నేనూ, నాది అనే కోణం నుంచి రచనలు చేశారని అన్నారు. విశ్రాంత ఎస్పీ రామ ఉమామహేశ్వర శర్మ మాట్లాడుతూ కాశీభట్ల సాహిత్య జీవితం, అతని జీవితం వేరు కావని, రెండూ ఒకటిగా సాగిందని అన్నారు. కవిగా, కథకునిగా, నవలాకారునిగా తెలుగు సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించి, విశేషమైన అభిమానులను సంపాదించుకున్నారని గుర్తు చేశారు. సంగీత విద్వాంసుడు ఎం. దయానంద్ మాట్లాడుతూ కాశీభట్ల సంగీత పరిజ్ఞానం ఉన్నవారని, వేణుగోపాల పదాలతో స్వరాన్ని సృష్టించారని అన్నారు. సభలో మధురకవి ఎలమర్తి రమణయ్య, కథా రచయిత్రి డాక్టర్ సుభాషిణి ఆయన సాహిత్య విలక్షణమైన జీవితాన్ని వివరించారు. అంతకు ముందు కాశీభట్ల వేణుగోపాల్ చిత్రపటానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉమానాథరావు, శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సభలో ఆద్య మెడికల్స్ అధినేత అవిజ వెంకటేశ్వరరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, విరసం రాష్ట్ర నాయకుడు పాణి, నాగేశ్వరాచారి, మారుతి పౌరోహితం, డాక్టర్ ఎం. హరికిషన్, చౌశా, సయ్యద్ జహీర్ అహ్మద్, డాక్టర్ పేరం ఇందిరాదేవి, లక్ష్మీ కందిమళ్ల, స్వర్ణలత, సీఐ శ్రీనాథ్‌రెడ్డి, టి. వెంకటేశ్, ఇనాయతుల్లా, ఎస్‌డీవీ అజీజ్, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు


మంత్రాలయం మఠం ప్రాగంణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 25: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం సోమవారం కృష్ణాష్టమి కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

350 మంది కళాకారుల నృత్యం


మధ్వమార్గ్ కారిడార్‌లో నృత్యం చేస్తున్న కళాకారులు

మంత్రాలయం, ఆగస్టు 25: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో కర్ణాటకలోని ఆసన్ చిన్నరాయపట్నం నేషనల్ క్లాసిక్ డ్యాన్స్ అకాడమీ, ప్రధాన కార్యదర్శి డా. స్వాతి, పి. భరద్వాజ్, శ్రీరాఘవేంద్ర స్వామి మఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మధ్వమార్గ్ కారిడార్‌లో నృత్యప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచే గాక జపాన్, జర్మనీ, ఇండోనేషియా దేశాల నుంచి 350 మంది నృత్య కళాకారులు 15 నిమిషాల పాటు నృత్యం చేసి అంతర్జాతీయ రికార్డు స్థాపించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కళాకారులకు మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, డీఎం ఆనందరావు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

బేతంచెర్ల, ఆగస్టు 25: మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన రెడ్డిపోగుల నాని (16) అనే యువకుడు తన స్నేహితులతో ఈతకు వెళ్లి ఆదివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నానితో పాటు నాగమణి, మధుసాయి అనే యువకులు గ్రామసమీపంలో ఉన్న బలపం గని వద్దకు ఈతకు వెళ్లారు. గనిలో ఉన్న నీళ్లలో నానిపై నుంచి దూకి గనిలో ఇరుక్కుపోయాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి గని నీళ్లలో ఇరుకుని మృతి చెందిన నానిని బయటకు తీశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంబశివనగర్‌లో చోరీ

కర్నూలు, ఆగస్టు 25: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సాంబశివనగర్‌లో చోరీ జరిగింది. ఆర్మీలో పని చేసే రమేష్ అనే వ్యక్తి ఇంట్లో మూడున్నర తులాల బంగారు నగలుతో పాటు కొంత వెండి, నగదు చోరీ చేశారు. రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 20వ తేదీన ఎ. క్యాంపులో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటికి వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న బంగారు నగలు మాయమైనట్లు గుర్తించాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మాత్రం మూడు రోజులు ఆలస్యంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం విశేషం.

శ్రీశైలానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

శ్రీశైలం, ఆగస్టు 25: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 39,000 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 6,759 క్యూసెక్కులు కలిపి మొత్తం 45,759 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 45,759 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 883.90 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 209.5948 టీఎంసీలుగా నమోదైంది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

మిలటరీ స్కూళ్లలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయ స్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచారకేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

ఎల్లెల్సీలో మహిళ మృతదేహం

హొళగుంద, ఆగస్టు 25: తుంగభద్ర ఎల్లెల్సీ దిగువ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహన్ని కనుగొన్నట్లు ఎస్సై బాల నరసింహులు తెలిపారు. ఆదివారం సాయంత్రం కడ్లేమాగి క్యాంపు వద్ద ప్రవహిస్తున్న కాలువలో ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మృతురాలి ఒంటిపై నలుపు రంగు చీర, ఆకు పచ్చని జాకెట్ ఉన్నట్లు తెలిపారు. వయస్సు 50 సంవత్సరాలకు పైగా ఉంటుందని అన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ అస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్వింటా వేరుశనగ రూ.7,270

ఎమ్మిగనూరు, ఆగస్టు 25: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ క్వింటం గరిష్ఠ ధర రూ. 7,270 పలికింది. మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి రైతు లు వేరుశనగ 2182 క్వింటా ళ్లు, ఆముదాలు 13 క్వింటా ళ్లు, పూలవిత్తనాలు 3 విత్తనా లు అమ్మకానికి వచ్చాయి. వేరుశనగ క్వింటం గరిష్ఠ ధర రూ. 7,270, కనిష్ఠ ధర రూ. 2070, ఆముదాలు గరి ష్ఠ ధర రూ. 5752, కనిష్ఠ ధర రూ. 5530, పూల విత్తనాలు గరిష్ఠ ధర రూ. 3620, కనిష్ఠ ధర రూ. 3620 పలికాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శేషాద్రి రెడ్డి (ఫైల్)

చిప్పగిరి, ఆగస్టు 25 : చిప్పగిరి మండలం నగరడోన గ్రామానికి చెందిన శేషాద్రి రెడ్డి (55) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఈ నెల 18న రాత్రి ఆలూరు నుంచి ద్విచక్ర వాహనంపై విజయ్‌కుమార్ రెడ్డి, శేషాద్రి రెడ్డి వస్తుండగా కుక్కను తప్పించే ప్రయత్నంలో నగరడోన కరెంట్ ఆఫీస్ వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. వెనుక కూర్చున్న శేషాద్రి రెడ్డికి బలమైన గాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు శేషాద్రి రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ బాబు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి శేషాద్రి రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం

కోడుమూరు, ఆగస్టు 25: పట్టణంలోని విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని శనివారం రాత్రి 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆ ప్రాంతంలోని రెండు స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు షాపులపై పడ్డాయి. ఆ సమయంలో ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్తంభాలు విరిగిపడటంతో రాత్రంతా కొత్తపేట, కొండపేట కాలనీలకు కరెంటు నిలిచిపోయింది. ఆదివారం ఉదయం విద్యుత్ అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి కరెంటు సరఫరా చేశారు.

ఆదమరిస్తే అంతే గతి

- శిథిలావస్థకు చేరుకున్న వంతెన
- నిత్యం ప్రమాదాలు.


రక్షణ గోడలేని వంతెన

కొలిమిగుండ్ల, ఆగస్టు 25: మండలంలోని నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా అంతే సంగతులు. అనంతపురం, తాడిపత్రి, గుత్తి, బళ్లారి ప్రాంతా ల నుండి కడప, నెల్లూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు ప్రతి రోజూ వేల సంఖ్యలో ఈ రహదారి గుండా వెళుతుంటాయి. అయితే కొలిమిగుండ్ల సమీపంలోని ఛాఖా నాయిని బ్రిడ్జి, కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగుపై ఉన్న వంతెన ప్రమాద కరంగా మారాయి. ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో ఇరుకుగా మారాయి. రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రక్షణ గోడలు లేక అతి వేగంగా వెళ్లే వాహనాలు బోల్తా పడుతున్నాయి. వందల సంఖ్యలో ప్రయా ణికులు క్షతగాత్రులవుతున్నారు. ఈ వంతెనల మీద జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రతి వారంలో ఒకటి లేదా రెండు వాహనాలు తప్పనిసరిగా ఈ వంతెనల వద్ద ప్రమాదానికి గురి అవుతున్నాయంటే పరిస్థితి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. బ్రిడ్జిలకు మరమ్మతు నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలని ఈ గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

లోడింగ్ కార్మికుడి ఆత్మహత్య

బేతంచెర్ల, ఆగస్టు 25: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి (42) అనే లోడింగ్ కార్మికుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. మూడేళ్ల క్రితం సంజామల మండలం గిద్దలూరు గ్రామం నుంచి ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి జీవనోపాధి కోసం బోయ మద్దిలేటి వచ్చాడు. రంగాపురం గ్రామంలో లోడింగ్ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబ పోషణ చేసుకునేవాడు. గత కొంత కాలంగా తాగుడుకు బానిసై భార్య లక్ష్మీదేవిని తరచూ వేధిస్తున్నాడు. దీంతో ఆమె శనివారం రాత్రి తన చెల్లెలు ఇంటికి వెళ్లింది. మద్దిలేటి తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

పాములపాడు, ఆగస్టు 25: మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా, చట్టాన్ని ఉల్లంఘించినా చర్యలు తప్పవని పాములపాడు ఎస్ఐ సురేశ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగు నిర్వహించారు. అయన మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు సృష్టించరాదని, హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహానంది: మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని రౌడీ షీటర్లకు ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం



సమావేశమైన కమిటీ సభ్యులు

మహానంది, ఆగస్టు 25: కాలుష్య రహిత సమాజం కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజించుదామని మహానంది గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కంచెర్ల శివ శివశంకర్, ప్రధాన కార్యదర్శి భూమా సుబ్బరామయ్యలు అన్నారు. ఆదివారం మహానందిలో మండల గణేష్ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. సెప్టెంబరులో జరిగే వినాయక చవితి ఉత్సవాలపై సభ్యులు చర్చించారు. మహానంది సమీపంలోని తెలుగుగంగ ప్రధాన చకాల్వ వద్ద వినాయక ఘాట్‌ను ఏర్పాటు చేసి క్రేన్ సాయంతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. నిబంధనల ప్రకారం వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కాశయ్య, ప్రధాన కార్యదర్శి కాకర్ల శివ, వెంకట్రాముడు, కిట్టు శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఎన్నిక

నందికొట్కూరు, ఆగస్టు 25 : పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం గణేష్ ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా అల్వాల బాలయ్య, అధ్యక్షుడిగా బద్దుల శ్రీధర్, గౌరవ సలహాదారుగా భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామిరెడ్డి, కృష్ణారెడ్డి, రంగస్వామి, ప్రధాన కార్యదర్శిగా భాను ప్రకాష్ రెడ్డి, సహాయకార్యదర్శులుగా వెంకటేష్, రవికుమార్ రెడ్డి, పాణ్యం వేణు, వైష్ణవి కళాశాల రవి, శ్రీకాంత్ గౌడ్, ఆర్టు శ్రీను, జేపీ రవికుమార్, చాకలి జయన్న, సురేష్, రాజశేఖర్, కోశాధికారిగా శేఖర్, న్యాయసలహాదారుగా సత్య నారాయణ, వెంకటరాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వినాయక మండపాల ఏర్పాటు ఉత్సవాల నిమజ్జన కార్యక్రమాలపై మండపాల నిర్వాహకులతో చర్చించారు.

వికలాంగుల సంక్షేమమే ధ్యేయం



మదర్ థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వికలాంగులు

పాణ్యం, ఆగస్టు 25 : వికలాంగుల సంక్షేమమే ధ్యేయంగా డిజబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తోందని అసోసియేషన్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి అన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వికలాంగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మదర్ థెరిసా స్ఫూర్తితో అసోసియేషన్ ఏర్పాటు చేసి వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా సహకరించాలని కోరారు. నియోజకవర్గ స్థాయి కమిటీ ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా వనం రాజు, సహాయ కార్యదర్శులుగా రవీంద్ర నాయక్, నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రేష్మ, రసూల్‌బీ, కోశాధికారిగా సుశేలుడులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంబవరపు ఎల్లయ్య పాల్గొన్నారు.

రేపు శ్రీకృష్ణ జన్మాష్టమి



కరపత్రాలను విడుదల చేస్తున్న శ్రీకృష్ణ దేవాలయ కమిటీ సభ్యులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 25: నంద్యాల పద్మావతీ నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో 27వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుతున్నట్లు నిర్వాహకులు పార్థసారథి, విజయచంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమాలలో భాగంగా సోమవారం రాత్రి 11.54గంటలకు శ్రీకృష్ణ జన్మనక్షత్ర పూజ, మంగళవారం ఉదయం స్వామివారి దివ్యదర్శనం, ధ్వజారోహణం, ఉట్టికొట్టడం ఉంటాయని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో మోహన్

శ్రీశైలం, ఆగస్టు 25: భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి పశ్చిమ గోదావరికి చెందిన ఎం.కె. ప్రసన్న అనే భక్తురాలు కలిసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతలు ఈ విరాళాన్ని దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి మోహన్‌కు అందజేశారు. దాతలను దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

- పట్టించుకోని విద్యుత్ అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 25 : గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రహదారుల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో పశువులు, మేకలు, గొర్రెలతోపాటు ప్రజలు మృత్యువాత పడుతున్నారు. నందికొట్కూరు నియోజకర్గంలోని నందికొట్కూరు మండలంలో 24, నందికొట్కూరు పట్టణంలో 5, పాములపాడు మండలంలో 24, పగిడ్యాల మండలంలో 5, జూపాడుబంగ్లా మండలంలో 24, మిడుతూరు మండలంలో 25 ట్రాన్స్‌ఫార్మర్ల ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే రైతుల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ గడ్డి, పిచ్చిమొక్కల మధ్యన ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు బేస్‌మెంట్ గోడలు దెబ్బతిన్నాయని రైతులు పోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె, దిమ్మెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వడ్డెమాను గ్రామంలో ప్రధాన రహదారి పక్కన రక్షణ కంచె లేని విద్యుత్ ట్రాన్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి



తనకు 3 ఎకరాలు పొలం ఉంది. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే కంచె లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ పక్కన వెళ్లాలంటే భయమేస్తోంది. కంచె ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా లాభం లేదు.

సుధాకర్, మద్దిగట్ల గ్రామ రైతు

కంచె ఏర్పాటు చేస్తాం

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటుకు చర్యలు చేపడుతాం. వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లరాదు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేస్తాం.

\- విద్యుత్ ఏడీ శ్రీనివాసులు



నందికొట్కూరు పట్టణంలోని మిడుతూరు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



తరిగోపుల గ్రామంలో రైతుల పొలం పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ కోఆర్డినేటర్ శేషఫణి

ఆత్మకూరు, ఆగస్టు 25: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ కోఆర్డినేటర్ శేషఫణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక థెరిసా జూనియర్ కళాశాలలో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో యాదవుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాదవులు ఐక్యతగా మెలిగి ఆర్థికంగా, సామాజిక, రాజకీయంగా రాణించాలని తెలిపారు. అదేవిధంగా యాదవుల చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. అనంతరం కాటంరాజు యాదవ భూసాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చింతల మోహన్‌రావు మాట్లాడుతూ కాటంరాజు పరిపాలనలో గ్రామాల్లో గంగమ్మ ఆలయాల నిర్మాణం, పశువుల పరిపరిరక్షణకు భూములను కేటాయించి పాలన సాగించారని చెప్పారు. అయితే ప్రస్తుతం ఆభూములన్ని అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం కాటమరాజు యాదవ భూసాధన సమితి రాయలసీమ కోఆర్డినేటర్‌గా స్థానిక నాయకుడు జయకృష్ణను ఎన్నుకున్నారు. అంతకుముందు బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన బీపీ మండల్ 106వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సింధూ నాగేశ్వరరావు, శివరామకృష్ణ, బాలస్వామియాదవ్, ఉమాదేవి ఉన్నారు.

భక్తులతో గౌరవంగా మెలగాలి

- శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీ



కొలనుభారతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న శివ యోగేంద్ర సరస్వతి స్వామిజీ

కొత్తపల్లి, ఆగస్టు 25: కొలనుభారతి అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులతో పురోహితులు గౌరవంగా మెలగాలని కాకనూరు శారదామఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ సూచించారు. ఆదివారం స్వామిజీ మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రం అమ్మవారిని దర్శించకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ పురోహితులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ పురోహితులతో మాట్లాడారు. కొలనుభారతి క్షేత్ర ఆలయ పునఃనిర్మాణం పనులు మధ్యలో నిలిచిపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి అమ్మవారి క్షేత్రం కావడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారని, వారికి క్షేత్రం పట్ల నమ్మకం కలిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆలయ పునఃనిర్మాణంపై త్వరలోనే దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు స్వామీజీ పేర్కొన్నారు. ఆయన వెంట శిష్య బృందం ఉంది.

భక్త జన సంద్రంగా మహానంది



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది, ఆగస్టు 25: వరుస సెలవులు రావడంతో మహానంది క్షేత్రం భక్త జన సంద్రంగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శనివారం రాత్రే మహానందికి చేరుకున్నారు. దీంతో దేవస్థానానికి చెందిన వసతి గదులతోపాటు పరిసరాల్లోని కల్యాణమండపాలు గదులు పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. ఆదివారం తెల్లవారు జాముననే ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్ల భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పరమశివుని దర్శనం కోసం క్యూలో నిల్చొని కాయకర్పూరాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏఈఓ ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఏఈఓ తెలిపారు. సోమవారం కూడా సెలవు రోజు కావడంతో మహానందిలో భక్తుల రద్దీ ఉండే అవకాశం ఉంది.

తెలంగాణ మద్యం పట్టివేత

పగిడ్యాల, ఆగస్టు 25 : ముచ్చుమర్రి పోలీస్ సేషన్ పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, హుశేన్ తెలంగాణ రాష్ట్రం నుంచి 20ఐటీ క్వాటర్లను తీసుకుని వచ్చి అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల కార్డన్ సెర్చ్



నందికొట్కూరు శికారి పేటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట, నాటుసారా

నందికొట్కూరు, ఆగస్టు 25 : నందికొట్కూరు పట్టణంలోని శికారి పేటలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సికారిపేటలో బెల్లం ఊట తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఒక ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి పరారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్ బాబు, లక్ష్మినారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మిడుతూరు, ఆగస్టు 25 : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డి తెలిపారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని తెలిపారు. అధికారులు సంబంధిత ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

శివపురం పాఠశాలకు మెయిన్ గేటు ఏర్పాటు చేయాలి



గేటు లేని శివపురం ఎంపీయూపీ పాఠశాల

కొత్తపల్లి, ఆగస్టు 25: కొత్తపల్లి మండలం శివపురం ఎంపీయుపీ పాఠశాలకు ప్రధాన గేటు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. గతంలో ఈ పాఠశాలకు ఉన్న మెయిన్‌గేటును గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళలో దొంగలు దోచుకెళ్లారని, అప్పటి నుంచి నేటి వరకు పాఠశాల ఉపాధ్యాయులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రధాన గేటు లేకపోవడం వల్ల రాత్రివేళల్లో మందుబాబులకు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, మూగజీవాలకు నిలయంగా మారిందని తెలిపారు. నాడు-నేడు కింద పాఠశాలల్లో నిలిచిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలును వివరణ కోరగా.. ఉన్నతాదికారుల దృష్టికి తెలియజేశామని తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో 49 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో డైరెక్టర్ రంగారావు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 25: నంద్యాలలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన ప్రముఖ సాఫ్టవేర్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంకు మెగా జాబ్ మేళా నిర్వహించాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 150 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించి ప్రతిభా వంతులను ఎంపిక చేశారు. 49 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెంకటేశ్వర జూనియర్ కళాశాల డైరెక్టర్ రంగారావు, ప్రిన్సిపాల్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. నిరుద్యోగులు అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.

ఆంజనేయస్వామికి కోట్ల పూజలు

డోన్, ఆగస్టు 25: మండలంలోని గుమ్మకొండ గ్రామంలో ఆదివారం జరిగిన పాతపాలెం ఆంజనేయస్వామి వేడుకల్లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. రాతి దూలం పోటీలను ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డి, హరిశంకర్‌గౌడు పాల్గొన్నారు.

సంత మార్కెట్‌కు ఆదరణ కరువు!



సంత మార్కెట్‌లో శిథిలావస్థకు చేరిన షెడ్లు

- ఆదాయం తప్ప అభివృద్ధి మరిచిన అధికారులు
- ఎక్కడబడితే అక్కడ చెత్త దిబ్బలు
- ఏటా నిర్వీర్యమవుతున్న మార్కెట్ నిర్వహణ



ప్రధాన ద్వారాలకు తలుపు లేని సంత మార్కెట్

ఆత్మకూరు, ఆగస్టు 25: ఒకప్పుడు వ్యాపారాలతో కళకళలాడిన ఆత్మకూరు సంతమార్కెట్‌కు గత కొన్నేళ్లుగా ఆదరణ కరువవుతోంది. ప్రతిఆదివారం ఇక్కడ జరిగే వారంతపు సంతతో పాటు ప్రతిరోజు జరిగే దినసరి మార్కెట్‌కు కూడా ఎంతో ప్రాధాన్యత ఉండేది. ఆత్మకూరు పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరు వారాంతపు సంతకు తరలివచ్చి కూరగాయాలు, ఇతర నిత్యావసరాలను ఇక్కడే కొనుగోలు చేసేవారు. దీంతో అప్పట్లో సంతమార్కెట్ ప్రాంగణంతో పాటు చుట్టు పక్కల ప్రదేశాల్లో కూడా వందల సంఖ్యలో దుకాణాలు వెలిసి ప్రజలతో కళకళలాడేది. కానీ నేడు ఆత్మకూరు సంతమార్కెట్ ఆదరణను కోల్పోతోంది. దీనికి గల ప్రధాన కారణం సంతమార్కెట్ నిర్వహణ గాడితప్పడమేనన్న విమర్శలు ఉన్నాయి. కేవలం ఆదివారం జరిగే సంతమార్కెట్‌ను పురస్కరించుకుని శనివారం మాత్రమే సంతమార్కెట్‌ను శుభ్రపరుస్తున్నారే తప్ప మిగతా రోజుల్లో నిర్వహణను సంబంధిత మున్సిపల్‌శాఖ పట్టించుకోవడం లేదు. ప్రతిఏటా సంతమార్కెట్ వేలాల రూపంలో లక్షల రూపాయల ఆదాయాన్ని అర్జిస్తున్న మున్సిపల్ శాఖ అధికారులు అదేస్థాయిలో సంతమార్కెట్‌ను తీర్చిదిద్దడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. సంతమార్కెట్‌లో ఏర్పాటు చేసిన షెడ్డులన్ని శిథిలావస్థకు గురై వర్షాకాలంలో తీవ్ర అసౌకర్యంగా మారాయి. అలాగే అనేక షెడ్లు నిరూపయోగంగా దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా మాంసం విక్రయాల కోసం కేటాయించిన ప్రదేశం అపరిశుభ్రంగా తయారై అక్కడ ఎలాంటి దుకాణాలను ఏర్పాటు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే సంతమార్కెట్‌కు ఉన్న మూడు ప్రధాన ద్వారాలకు తలుపులు లేకపోవడం వల్ల పశువులు సంతలోకి ప్రవేశించి వీరంగం సృష్టిస్తున్నాయి. వీటికితోడు ప్రతిరోజు జరిగే మార్కెట్ సందర్భంగా వచ్చే వ్యర్థాలేకాకుండా చుట్టుపక్కల వారు సంతమార్కెట్‌లో చెత్తాచెదారాన్ని వేయడం వల్ల సంతమార్కెట్ అధ్వానంగా తయారవ్వడంతో ప్రదేశంలో కూరగాయాలు, ఇతర నిత్యావసర సరుకులను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా.. సంబంధిత మున్సిపాలిటీ అధికారులు స్పందించి సంతమార్కెట్‌లో శిథిలావస్థకు చేరుకున్న షెడ్డులను బాగుపర్చడంతో పలు పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సౌకర్యాలు లేని ఆత్మకూరు సంత మార్కెట్



ఆత్మకూరు సంత మార్కెట్ దుస్థితి

గంగమ్మకు బోనాలు



గంగమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఉయ్యాలవాడ, ఆగస్టు 25 : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన గంగపుత్రులు ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామంలోని పెద్దలు, బెస్తనాయకులు కలిసి మేళతాళాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. కుందూ నది వద్దున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వర్షం సమృద్ధిగా కురవాలని కోరారు.

కొలిమిగుండ్ల: మండలంలోని మదనంతపురం, చింతలాయపల్లె గ్రామాల్లో వర్షం కోసం గంగమ్మకు గ్రామస్థులు పూజలు నిర్వహించారు. మదనంతపురంలో గ్రామస్థులు గంగమ్మకు జలాభిషేకం నిర్వహించి, బోనాలు సమర్పించారు. మండల తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాదు, జయరా మిరెడ్డి, గంగరాజు, ప్రతాపరెడ్డి, రఘు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 25: డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులును ఆదివారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, రామదుర్గం మాజీ ఎంపీటీసీ జయ రాముడులు డీఎస్పీ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

ప్యాపిలి: స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం సీఐ వెంకటరామిరెడ్డిని టీడీపీ నంద్యాల పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అలేబాదు పరమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ సమస్యలపై సీఐతో మాట్లాడారు. సీఐని కలిసిన వారిలో నాయకులు అలేబాదు మల్లికార్జున, రామక్రిష్ణ ఉన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

ఆళ్లగడ్డ, ఆగస్టు 25: ఆళ్లగడ్డ తాలుకాలో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ నూతన డీఎస్పీ రవికుమార్‌ను ఎమ్మెల్యే అఖిలప్రియ కోరారు. ఆళ్లగడ్డ డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను ఎమ్మెల్యే ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. గత ప్రభుత్వంలో యువత డ్రగ్స్ బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకున్నారని, ఇకపై అలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చాగలమర్రి, ఆగస్టు 25: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు, అనుమానితులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై పోలీసు ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి ఘర్షణలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని హెచ్చరించారు. గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే పోలీసు చర్యలు తప్పవని అన్నారు. మంచి ప్రవర్తనతో శాంతియుత జీవనాన్ని గడపాలని రౌడీషీటర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ, పోలీసులు ఉన్నారు.

గంగమ్మ ఆలయంలో దీపోత్సవం

చాగలమర్రి, ఆగస్టు 25: చాగలమర్రిలోని గంగమ్మ ఆలయంలో మహిళలు శ్రావణమాసం సందర్భంగా సామూహిక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, చాగలమ్మ ఆలయాల్లో మహిళలు సామూహికంగా బోనాలు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు రండి



ఎమ్మెల్యే అఖిలప్రియకు శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 25: అహోబిలం ఇస్కాన్ ఆలయంలో సోమవారం జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు రండంటూ ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే అఖిలప్రియను ఆహ్వానించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం వారు ఎమ్మెల్యేను కలిసి శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆమెకు శాలువ కప్పి, ఆహ్వాన పత్రాన్ని అందించారు.

ఆంజనేయ స్వామికి కోట్ల పూజలు

డోన్, ఆగస్టు 25: మండలంలోని గుమ్మకొండ గ్రామంలో ఆదివారం జరిగిన పాతపాలెం ఆంజనేయస్వామి వేడుకల్లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. రాతి దూలం పోటీలను ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డి, హరిశంకర్‌గౌడు పాల్గొన్నారు.

సీతారాములకు విశేష పూజలు

చాగలమర్రి, ఆగస్టు 25: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానిదేవి ఆధ్వర్యంలో సీతారాములకు సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. పల్లకిలో సీతారాములను కొలువుదీరింప చేసి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మంగపల్లెలో వైద్య శిబిరం

సంజామల, ఆగస్టు 25: మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సంజామల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన ప్రజలు వైద్య శిబిరానికి హాజరై బీపీ షుగర్, గుండె జబ్బులు, కీళ్ల వ్యాధులు, కంటి, చెవి, ముక్కు వ్యాధులకు సంబంధించి కర్నూలు, నంద్యాల పట్టణానికి చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రోగులకు గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో గురు రాఘవేంద్ర గురురాజ విద్యా సంస్థల డైరెక్టర్లు మౌలాలి రెడ్డి, షెక్షావలి రెడ్డి, విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో కేసీ పంట కాలువలు

- చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు
- ఐదేళ్ల నుంచి ప్రతిపాదనలకే పరిమితం

చాగలమర్రి, ఆగస్టు 25: చెంతనే నీరు ఉన్నా రైతుల చింత తీరడం లేదు. చాగలమర్రి గ్రామంలోని కేసీ పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టుకు నీరందించే పంట కాలువలు దెబ్బతిన్నాయి. కాలువల్లో ముళ్ల కంపలు, పూడిక పెరిగింది. లైనింగ్ దెబ్బతింది. కాలువల మరమ్మతు పనులు చేపట్టక పోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఐదేళ్ల నుంచి ఎలాంటి పనులు చేపట్టలేదు. ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారు. నామ మాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. వెయ్యి ఎకరాలకు పైగా సాగు నీరు అందించాల్సి ఉండగా 300 ఎకరాలకు కూడా నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలు ఇలా ఉంటే నీరు ఎలా పారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువలు సరిగా లేక పోవడంతో ఆయ కట్టు రైతులు వరి పంట సాగును వదిలేసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటున్నారు. మల్లేవేముల గ్రామ సమీపంలో పంట కాలువ పనులు పూర్తి



ముళ్ల కంపలతో నిండిన కేసీ పంట కాలువ



కేసీ అక్విడెట్ నుంచి లీకేజీ అవుతున్న నీరు

చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. చేసిన కాలువ పనులు నాణ్యత లోపించి లైనింగ్ దెబ్బతింది. దీంతో ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. చాగలమర్రిలోని మురికి నీరంతా ఆయకట్టు పొలాల్లో ప్రవహిస్తుండటంతో వరి పంట సాగు చేసుకునేందుకు వీలు లేదని రైతులు వాపోతున్నారు. మురికి కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో పంట పొలాల్లో మురికి నీరు ప్రవహిస్తోందని, దీంతో నష్టపోతున్నామని రైతులు విలపిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పంట కాలువ మర మ్మతు పనులు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. మురికి నీరు పంట పొలాల్లో ప్రవహించకుండా చూడాలని రైతులు అధికారులకు తెలియ జేస్తున్నారు. కాలువల మరమ్మతుల విషయం గురించి కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలిని వివరణ కోరగా కేసీ పంట కాలువలు, అక్విడెట్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని అన్నారు.

'మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకు రావాలి'

డోన్(రూరల్), ఆగస్టు 25: మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, మాణిక్యం శెట్టి, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న క్లబ్ హౌస్‌లో జన విజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, ఎన్ఎన్ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

వెలగని వీధి లైట్లు

ప్రజలకు తప్పని ఇక్కట్లు



శాంతినగర్‌లో అలుముకున్న చీకట్లు

కొలిమిగుండ్ల, ఆగస్టు 25: శాంతినగర్‌లో గత కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో ఆయా కాలనీల్లో చీకట్లు అలముకున్నాయి. ఫలితంగా శాంతినగర్‌లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్టాండు వెనుకనే ఉన్న శాంతినగర్‌లో ఆసుపత్రితో పాటు, తపాలా కార్యాలయం, పాఠశాలలు ఉన్నాయి. నిత్యం ప్రజలు రద్దీగా తిరిగే శాంతినగర్‌లో వీధి లైట్లు వెలగకపోతే మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

రూ.2.50 కోట్లతో రహదారికి మరమ్మతులు

చాగలమర్రి, ఆగస్టు 25: చాగలమర్రి గ్రామం నుంచి మల్లేవేముల గ్రామానికి వెళ్లే రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. గత ఐదేళ్ల నుంచి అధ్వానంగా ఉన్న హైవే రహదారికి టీడీపీ ప్రభుత్వంలో మోక్షం లభించింది. చాగలమర్రి నుంచి కడప జిల్లా వేంపల్లె గ్రామం వరకు దెబ్బతిన్న బీటీ రోడ్డు పనులు చేసేందుకు రూ.2.50 కోట్లు నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికారి సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. పనులను త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారి షరిప్, వర్క్ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



అవుకులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మంజునాథరెడ్డి

అవుకు, ఆగస్టు 25 : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలకు గురికావలసి వస్తుందని బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రౌడీషీటర్లను ఎస్‌ఐ రాజారెడ్డి అవుకు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా కొనసాగుతుందన్నారు.

బేతంచెర్ల: మండలంలోని గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ అల్లర్లు సృష్టిస్తే తాట తీస్తానని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అశోక్, పోలీ సు సిబ్బంది, ఆయా గ్రామాల రౌడీషీటర్లు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కొలిమిగుండ్ల, ఆగస్టు 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం ఆది వారం వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆసక్తి ఉన్న విద్యర్థులతో దరఖాస్తు చేయించాలని సూచించారు.

వైభవంగా దస్తగిరి స్వామి జార్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

డోన్(రూరల్), ఆగస్టు 25: పట్టణంలోని పాతపేట దస్తగిరి స్వామి పీర్లచావిడిలో మొహరం వేడుకలు ముగిసి 40 రోజులైన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం జార్తులు ఘనంగా నిర్వహించారు. దస్తగిరి స్వామి పీర్ల చావిడిలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

బేతంచెర్ల: మండలంలోని సిమెంటునగర్‌లో మౌలాలిస్వామి జార్తులను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొహర్రం వేడుకలు ముగిసిన 40 రోజుల తర్వాత జార్తులను దర్గా పీఠాధిపతి ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. మౌలాలి స్వామి దర్గాలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఫతేహాలు సమర్పించారు.

పుట్టాలమ్మకు పూజలు



అమ్మవారికి పూజలు చేసేందుకు బారులు తీరిన భక్తులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 25: ఆళ్లగడ్డ మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో వెలసిన అమ్మవారికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని, కానుకలు సమర్పించుకున్నారు. భక్తులకు ఈవో సాయి జయచంద్రారెడ్డి అన్నదానం చేశారు.

లింగమయ్య స్వామికి..

రుద్రవరం, ఆగస్టు 25: మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

● మండలంలోని కొండమాయపల్లె, యల్లావత్తుల, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, రుద్రవరం గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మారెమ్మ. సుంకులమ్మ, పెద్దమ్మ అమ్మవార్లకు దర్శించుకుని బోనాలు చీరలు సమర్పించారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సంజామల, ఆగస్టు 25: ప్రాథమిక స్థాయి నుంచే ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని నొస్సం సీఎస్ఐ చర్చి ఫాస్టర్ విక్టర్ విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నొస్సం సీఎస్ఐ చర్చిలో ఇండియన్ క్యాంపస్ క్రూసైట్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో కర్నూలు ఇన్‌చార్జి సాల్‌మాన్‌రాజ్ అధ్యక్షతన విద్యార్థులకు బైబిల్‌పై ఆధ్యాత్మిక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కలచట్లలో రంగస్వామి గ్రామోత్సవం

ప్యాపిలి, ఆగస్టు 25: మండలంలోని కలచట్ల గ్రామంలో ఆదివారం రంగస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి మంచి పంట దిగుబడులు పండాలని కోరుతూ రైతులు, గ్రామస్థులు రంగస్వామికి పూజలు చేశారు.

పశువుల్లో నోటి వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 25: ఆవులు, గేదెల్లో తరచూ సంభవించే నోటి, పాదం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి డా.పద్మావతి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఆవులు, గేదెల్లో నోటి, పాదం వ్యాధుల నివారణ కోసం టీకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

డోన్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ




కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న మహిళలు

డోన్(రూరల్), ఆగస్టు 25: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యకు నిరసనగా ఆదివారం రాత్రి డోన్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్ ప్రధాన రోడ్డు నుంచి గాంధీ విగ్రహం వరకు క్యాండిల్స్‌తో ర్యాలీ నిర్వహించారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. సమితి అధ్యక్షుడు షాదిఖానా రాజా తదితరులు పాల్గొన్నారు.

అవోపా అధ్యక్షుడు మృతి

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే కోట్ల



కృష్ణ కిషోర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, ఆగస్టు 25: డోన్ అవోపా అధ్యక్షుడు మాకం కృష్ణకిషోర్ (64) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని యు. కొత్తపల్లి గ్రామానికి చెందిన కృష్ణకిషోర్ పది రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అవోపా అధ్యక్షుడిగా పదిహేనేళ్ల పాటు ఆయన సేవలు అందిస్తున్నారు. కృష్ణ కిషోర్ మృతికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సంతాపం తెలిపారు. యూ.కొత్తపల్లిలోని ఆయన నివాసం వద్ద భౌతిక కాయంపై పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణి రాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు సంతాపం తెలియజేశారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న కొలిమి ఉసేన్‌వలి

చాగలమర్రి, ఆగస్టు 25: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల జిల్లా మైనార్టీసెల్ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి తెలిపారు. ఆదివారం చాగలమర్రి కేజీవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలపై మాట నిలుపుకున్నారని అన్నారు. సీఎం ప్రమాణ స్వీకారం రోజే 6 సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. పేదల కోసం రాష్ట్రంలో 100 క్యాంటిన్‌లను ఏర్పాటు చేసి రూ.5కే భోజనం అందిస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రైతు భరోసా పథకాలను అమలు చేయడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబూబ్‌బాష, కొలిమి సున్ని, కొలిమిసోను, కమల్‌అహ్మద్, ఉసేన్‌సాబ్, కింగ్‌హుసేన్, ఉసేన్‌పీరా ఉసేన్‌బాషా పాల్గొన్నారు.

నల్లమలలో నాటుసారా బట్టీలపై దాడి



నాటుసారా బట్టీలు, డ్రమ్ములను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

రుద్రవరం, ఆగస్టు 25: నల్లమలలోని హరినగరం, ముకుందాపురం గ్రామాల సమీపంలో నిర్వహిస్తున్న నాటుసారా బట్టీలపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. 1800 లీటర్ల నాటుసారా ఊటను పారబోసి, ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వర ప్రసాద్ తెలిపారు. నల్లమల అటవీ తీరంలో నాటుసారా బట్టీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కుందూకు పెరిగిన వరద



కోవెలకుంట్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

కోవెలకుంట్ల, ఆగస్టు 25: కుందూ నదికి వారం రోజులుగా నీరు అధికంగా రావడంతో వరద ప్రవాహం పెరిగింది. గత వారం రోజుల క్రితం ఎగువభాగంలో కురిసిన వర్షాలకు నీరు కుందూలో చేరి అధికంగా ప్రవహిస్తోంది. కోవెలకుంట్ల పట్టణంలోని తాలుకా ఆఫీసు పక్కనే ఉన్న కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అటు వైపు వెళ్లే ప్రయాణికులు ఆసక్తిగా చూస్తున్నారు. దీంతో కుందూ పరివాహక ప్రాంతం వెంట రైతులు వరిపంటను సాగు చేస్తున్నారు.

తొమ్మిది రోజులపాటు కృష్ణాష్టమి వేడుకలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 25: మండలంలోని పలు గ్రామాలలో నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రబోధా సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు నాయుడు, క్రిష్ణారెడ్డి, బాబు, హరి వెల్లడించారు. మండలంలోని మీర్జాపురం, కొలిమి గుండ్ల, బందార్లపల్లె, నాయినిపల్లె గ్రామాల్లో ప్రత్యేక మండపాల్లో శ్రీకృష్ణుడి ప్రతిమలు ప్రతిష్ఠించి, 9రోజులపాటు పూజలు నిర్వహిస్తామన్నారు.



శ్రీకృష్ణుడి ప్రతిష్ఠ కోసం సిద్ధంగా ఉన్న మండపం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో ఈనెల 26 నుంచి 31 వరకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రబోధా సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కోవెలకుంట్ల అధ్యక్షుడు జనార్దన్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటల నుంచి భగవద్గీత పఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు అభినవ శంకరానందస్వామి, ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ సల్లా నాగరాజు ఆదివారం పేర్కొన్నారు.

ఏటీఎం కేంద్రం ఉన్నా లేనట్లే..

సంజామల, ఆగస్టు 25: పేరుసోమలలో ఏటీఎం కేంద్రం ఉన్నా లేనట్లేనని ఖాతాదారులు వాపోతున్నారు. మండలంలోని అతి పెద్ద గ్రామమైన పేరుసోమలలో నాలుగు నెలల నుంచి ఏటీఎం సేవలు అందక పోవడంతో ఖాతాదారులు విసుగెత్తి పోయారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామంలో యూనియన్ బ్యాంకు ఏర్పాటైంది. ఏటీఎం నాలుగు నెలల నుంచి మూతపడటంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటీఎం సేవలను తిరిగి కొనసాగించాలని ఖాతాదారులు కోరుతున్నారు.



పని చేయని ఏటీఎం కేంద్రం